క్లుప్తంగా

లక్కీడ్రా ద్వారా లడ్డూ ప్రసాదం పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి సమర్పించిన లడ్డూను శనివారం ఆలయ కమిటీ సభ్యులు లక్కీ డ్రా ద్వారా భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వీఎస్ రాజు, డి.శివరామరాజు, ఐఎస్ఎన్ రాజు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో పూజలు చేసిన లడ్డూను లక్కీ డ్రా నిర్వహించి డ్రాలో గెలుపొందిన వారికి అందజేసినట్లు తెలిపారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



విజయవాడ కల్చరల్: పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం 300 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. దాతలు బోడేపూడి ఫణికుమార్, మృదుల, సునాలీ, దుర్గా వెంకట సుబ్బారావు, చెక్కా పుష్పలత, రమణ కుమార్‌ల సహకారంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించినట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి తెలిపారు. ముందుగా దేవాలయంలో అర్చకస్వాములు పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వ్యక్తిపై గాజు సీసాతో దాడి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తన భార్యతో మాట్లాడుతున్నాడని ఓ వ్యక్తిపై గాజు సీసాతో దాడి చేసిన ఘటన భవానీపురం బ్యాంక్ సెంటర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యాధరపురం కామకోటినగర్‌కు చెందిన నాగోజు ఉదయసాయి భవానీ హాస్పిటల్‌లోని మెడికల్ షాపులో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి షాపులో పనులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళుతున్నాడు. బ్యాంక్ సెంటర్ ఆక్స్‌ఫర్డ్ స్కూల్ సమీపంలోకి వెళ్లే సరికి వెనుక నుంచి రామకృష్ణ అనే వ్యక్తి గాజు సీసాతో ఉదయసాయిపై దాడి చేశాడు. తల, కుడి చేయి, వీపుపై గాజుతో పొడిచాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అక్కడికి సమీపంలో ఉన్న రామకృష్ణ సోదరుడు సాయి వచ్చి గొడవ పెద్దది చేశాడు. ఆ సమయంలో గాయపడిన ఉదయసాయిని స్నేహితులు భవానీ ఆసుపత్రికి, అక్కడ నుంచి ఆంధ్ర హాస్పిటల్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం న్యూ జీజీహెచ్‌కు తరలించారు. తనపై జరిగిన దాడి ఘటనపై ఉదయసాయి పోలీసులకు స్టేట్‌మెంట్ ఇవ్వగా పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో అనంత పద్మనాభస్వామి వ్రతం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మీ (కొత్త అమ్మవారి) ఆలయ ప్రాంగణంలో శనివారం అనంత పద్మనాభ స్వామివారి వ్రతాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించారు. తెల్లవారుజామున ఆలయ ప్రాంగణంలో 12 మంది ఆళ్వార్‌లతో కొలువై ఉన్న అనంత పద్మనాభస్వామి వారికి విశేష అభిషేకాలు, తులసీ దళ అర్చనలను ఆలయ అర్చకులు నిర్వహించారు. అనంతరం ఆస్థాన కల్యాణ మండపంలో స్వామివారి వ్రతం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వినుకొండ రత్నమాచార్యులు 30 మంది ఉభయదాతలచే స్వామివారి వ్రతాన్ని ఆచరింపచేయడంతో పాటు వ్రత మహత్యాన్ని వివరించారు. వ్రతాన్ని ఆచరించిన భక్తులు, ఉభయదాతల ఇంట ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. వ్రతంలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరగగా, ఆలయ కమిటీకి చెందిన మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, పోతిన ధర్మారావు, మజ్జి శ్రీనివాసరావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు ఆలయాలు మూసివేత

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయ స్వామివారి దేవాలయాన్ని సంపూర్ణ చంద్రగ్రహణం పురస్కరించుకుని ఆదివారం ఉదయం 11.30 నుంచి సోమవారం ఉదయం ఏడు గంటల వరకు మూసివేయనున్నట్లు ఆలయ ఈఓ పాతూరి లోకేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం అర్చకులు సంప్రోక్షణ నిర్వహించిన తర్వాత ఆలయం తెరచి భక్తులను అనుమతించడం జరుగుతుందన్నారు. అలాగే ముత్యాలంపాడులోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామివారి దేవాలయం, శ్రీకోదండ రామాలయాన్ని కూడా మూసివేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు డీఎస్ రాజు తెలిపారు.

గంగ ఒడికి గణనాథుడు

కోలాహలంగా వినాయక విగ్రహాల నిమజ్జనం



నిమజ్జనానికి తరలివెళుతున్న శ్రీనాగమానసాదేవి ఆలయంలోని గణేషుని విగ్రహం



కొత్తపేట కుమ్మరివీధిలోని స్వామి విగ్రహం



కొత్తపేట రెండో కుమ్మరివీధిలో గణపతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వినాయక చవితి సందర్భంగా లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డీ నాగసాయిబాబా, శ్రీనాగమానసాదేవి అమ్మవారి దేవస్థానంలో నిర్వహించిన గణపతి ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా గణనాయకుని విగ్రహానికి కోటి పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళ తాళాలు, భక్తుల కోలాహలం మధ్య గణేష్ విగ్రహ నిమజ్జనం కార్యక్రమం జరిగింది. ఆలయానికి పక్కనే ఉన్న రైవస్ కాలువలో నిమజ్జనం చేశారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధా స్వామి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్‌లో ట్రెండ్‌సెట్ మెడోస్ రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన జరుగుతున్న చవితి ఉత్సవాలు శనివారం ముగిశాయి. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. అనంతరం మేళ తాళాలు, డప్పువాయిద్యాలు, కోలాట నృత్యాల నడుమ నిమజ్జనోత్సవం జరిగింది.

వైభవంగా నిమజ్జనాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని గణేష్ నిమజ్జనాలు శుక్రవారం అర్ధరాత్రి కొన్ని, శనివారం మరికొన్ని అత్యంత వైభవంగా జరిగాయి. రెండు రోజులుగా భారీ విగ్రహాలన్నీ కృష్ణమ్మ ఒడికి చేరకుంటున్నాయి. మంగళ వాయిద్యాలు, డప్పుల విన్యాసాలు, రాష్ట్రంతో పాటుగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జానపద కళాకారుల ప్రదర్శనలతో, చిత్ర విచిత్ర వేషధారణలతో స్వామి వారి నిమజ్జన ఊరేగింపులు ముందుకు సాగాయి. క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ (వస్త్రలత) ఆధ్వర్యంలో వారి వ్యాపార సముదాయంలో ఉంచిన రెండు విగ్రహాలను భారీ వాహనాలపై అధిష్టింపజేసి ఊరేగించారు. అలాగే వివిధ చవితి పందిళ్ల నిర్వాహకులు ఏర్పాటు చేసిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. తమిళనాడు, కేరళ నుంచి కళాకారులతో ప్రదర్శనలిప్పిస్తూ ఊరేగింపును నిర్వహించారు. అదే విధంగా గణేష్ ఉత్సవ సమితి (మార్వాడీ సంఘం) ఆధ్వర్యంలోనూ భారీ ఊరేగింపుగా స్వామివారిని నిమజ్జనానికి తరలించారు. అలాగే ఐదు దశాబ్దాల నుంచి ఉత్సవాలను నిర్వహిస్తున్న ఉమా పుత్ర సేవా సమితి (పూలబావి వీధి) నిర్వాహకులు సైతం స్వామివారిని నిమజ్జనానికి వైభవంగా తరలించారు. పూజారివారి వీధిలోని శ్రీ బాలగణపతి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకమూర్తిని ఊరేగించారు. రాయల్ హోటల్ సెంటర్‌లోని మిత్ర బృందం తమ గణపతిని నిమజ్జనానికి అంగరంగ వైభవంగా తరలించారు. వారితో పాటుగా మొయిన్‌బజార్‌లోని వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు సైతం నిమజ్జనానికి ఊరేగింపుగా తరలించారు.



ట్రెండ్‌సెట్ మెడోస్‌లో పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా



ఊరేగింపులో ప్రత్యేక వేషధారణ



వస్త్రలత ఊరేగింపులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివుని విగ్రహం

బాలుడు అదృశ్యంపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బిస్కెట్స్ కోసమని ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలుడు అదృశ్యమైన ఘటన విద్యాధరపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... విద్యాధరపురం కృష్ణారావు వీధికి చెందిన తమ్మిన హేమంత్ నేషనల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. 9వ తరగతి వరకు వేరే స్కూల్‌లో చదివాడు. ఆ సమయంలో చెడు స్నేహాలకు అలవాటు పడ్డాడు. స్కూల్‌కు సక్రమంగా వెళ్లకుండా క్రికెట్ పందాలు వేస్తుండటంతో ఇంట్లో తెలిసి మందలించారు. ఆ తర్వాత స్కూల్ మార్పించారు. అయినప్పటికీ అతనిలో మార్పు రాలేదు. నెల రోజుల క్రితం ఒకసారి ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి వచ్చాడు. ఇంటికి వచ్చిన అతడిని తల్లిదండ్రులు నిలదీయగా తిరుపతి వెళ్లానని సమాధానం ఇచ్చాడు. తర్వాత రోజు నుంచి స్కూల్‌కు వెళుతున్నాడు. ఆగస్టు 31వ తేదీ రాత్రి సమయంలో బిస్కెట్స్ కోసం బయటకు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఆ తర్వాత ఇంటికి తిరిగి రాలేదు. అప్పటి నుంచి అతని కోసం వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో బాలుడి తల్లి సత్యవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. కలిదిండి మండలం మట్టగుంట గ్రామానికి చెందిన సిరంగి అశోక్(32) ఈనెల 5వ తేదీ అర్ధరాత్రి దాటిన తరువాత ద్విచక్రవాహనంపై కంకిపాడు నుంచి గుడివాడ వైపు వెళ్తూ కోమటిగుంట లాకులు దాటిన తరువాత రహదారి మధ్యలో ఉన్న గొయ్యి కారణంగా బైక్ అదుపు తప్పి కింద పడటంతో గాయపడ్డాడు. వాహనదారులు ప్రమాదాన్ని గుర్తించి 108 అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. ఆస్పత్రి వర్గాల సమాచారంతో ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

నేత్రదానంపై అవగాహన సదస్సు



నేత్రదానం పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న మూర్తి, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు నేత్రదానంపై అవగాహన పెంచుకోవడంతో పాటు నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని సిద్ధార్థ ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఎన్టీఆర్ జిల్లా డీపీఎం డాక్టర్ ఈఎస్ఎన్ మూర్తి సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సహకారంతో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన నేత్రదానంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు నేత్రదానం ప్రాముఖ్యతను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్ సిబ్బంది మరణించిన దాతల నుంచి కార్నియాలను సేకరించే విధానాన్ని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మనం చేసే నేత్రదానంతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం ఉందని అన్నారు. అనంతరం నేత్రదానం పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె.రమేష్, ఫిజికల్ డైరెక్టర్ యుగంధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

22 నుంచి గంగానమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమనవారిపేటలోని గంగానమ్మ దేవస్థానంలో 22వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు శ్రీదుర్గా గాయత్రి అర్చక యాగ్నిక పురోహిత సేవా సంఘ అధ్యక్షుడు విన్నకోట శ్రీనివాసరావు శర్మ తెలిపారు. శ్రీదుర్గా గాయత్రి అర్చక యాగ్నిక పురోహిత సేవా సంఘం ఆధ్వర్యంలో 11 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో ప్రతి రోజూ అమ్మవారికి విశేష అలంకారం, కుంకుమ పూజలు, పుష్పార్చనలు జరుగుతాయన్నారు. 22న శ్రీబాలా త్రిపుర సుందరీదేవి, 23న శ్రీగాయత్రిదేవి, 24న శ్రీఅన్నపూర్ణాదేవి, 25న శ్రీకాత్యాయనిదేవి, 26న శ్రీమహాలక్ష్మీదేవి, 27న శ్రీలలితా త్రిపుర సుందరీదేవి, 28న మహాచండీదేవి, 29న శ్రీసరస్వతిదేవి, 30న దుర్గాదేవి, 01వ తేదీ మహిషాసురమర్దిని దేవి, 02న శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారాలు ఉంటాయన్నారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ బసవ కాశీ విశ్వనాథ్, గౌరవ అధ్యక్షుడు సుంకర వెంకటేశ్వరరావు, సెక్రటరీ విజయ్ కుమార్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకోవాలని భక్తులను కోరారు.

బుడమేరు పూడికతీతపై నిర్లక్ష్యం తగదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



న్యూఆర్ఆర్‌పేట బుడమేరు పరివాహక ప్రాంతంలో పర్యటిస్తున్న బాబూరావు, సీపీఎం నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మరోసారి బుడమేరు ముంపు ప్రమాదం ఉందని తెలిసినా.. బుడమేరులో పూడికతీత పనులు పూర్తిచేయకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలోని బుడమేరు పరివాహక ప్రాంతాల్లో సీపీఎం నాయకులతో కలిసి శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ గతేడాది బుడమేరు వరదలతో మేటవేసుకుపోయిందని.. ఆ మట్టిని తొలగించడానికి సంవత్సర కాలంలో ఇరిగేషన్ శాఖ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. దీనివల్ల బుడమేరు లోతు మరింత తగ్గిపోయిందన్నారు. న్యూఆర్ఆర్‌పేట నుంచి రాఘవేంద్ర థియేటర్ వైపు వెళ్లే రైల్వే ట్రాక్ కింద ఎనిమిది ఖానాలు ఉండగా వాటిలో ఐదారు ఖానాలు పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయాయని తెలిపారు. బుడమేరు ప్రవాహానికి చెత్తాచెదారాలు ఆటంకంగా ఉన్నా వాటిని తొలగించే నాథుడే లేడని ఆరోపించారు. అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లు పూర్తిగా పూడిపోయాయని.. దీని వల్ల దోమల సమస్య పెరిగి ప్రజారోగ్యం క్షీణిస్తుందన్నారు. బుడమేరు భయంతో నేటికి నగర ప్రజలు గడగడలాడుతున్నారని.. గతేడాది వరదల్లో మరణించిన కుటుంబాలకు న్యాయం చేయకుండా ప్రభుత్వం ఆదమరిచిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాలకులు.. ఇరిగేషన్ శాఖ అధికారులు మొద్దు నిద్ర వీడి బుడమేరు పరిరక్షణపై ప్రత్యేక దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. ముంపు సమస్యలు తలెత్తకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని.. లేనిపక్షంలో మరో ప్రజా ఉద్యమాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. పర్యటనలో సీపీఎం నాయకులు బి.రమణారావు, కె.దుర్గారావు, శ్రీనివాస్, పీర్ సాహెబ్, వెంకటరెడ్డి, అప్పన్న, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐలా ఎన్నికల నిర్వహణకు కసరత్తు!

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఐలా ఎన్నికలు నిర్వహించేందుకు ఏపీఐఐసీ అధికారులు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగా శనివారం ఒక ప్రముఖ ప్రజాప్రతినిధిని కలిసి ఈ విషయం గురించి మాజీ ఐలా పాలకవర్గం పెద్దలు పలువురు చర్చించినట్లు తెలిసింది. దీంతో ఆ ప్రజాప్రతినిధి వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని సంబంధిత ఏపీఐఐసీ అధికారులకు హుకుం జారీ చేసినట్టు స్థానికులు అనుకుంటున్నారు. పాత పాలకవర్గం పదవీకాలం 2022 ఏప్రిల్‌లో పూర్తయింది. నాటి నుంచి ఇప్పటి వరకు ఐలా కమిషనర్‌లే పరిపాలన చేస్తున్నారు. కార్మికవాడలో ఆస్తిపన్ను 60 శాతం వసూలు అయితేనే అధికారులు ఎన్నికలు నిర్వహిస్తారు. ఇప్పటి వరకు 40 శాతం మాత్రమే పన్ను వసూలు అయింది. ఇలా అయితే ఎన్నికలు నిర్వహించడం వీలుపడదని కొందరు అంటున్నారు. మిగతా 20 శాతం ఆస్తి పన్ను కూడా త్వరితగతిన వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆ ప్రజాప్రతినిధి సంబంధిత అధికారులను ఆదేశించినట్లు సమాచారం. కార్మికవాడలోని ఆస్తిదారులందరూ ఆస్తిపన్ను చెల్లించాలి. అంతేకాకుండా సర్వీస్ సొసైటీ సభ్యత్వం సైతం చెల్లించాల్సి ఉంది. ఈ రెండు చెల్లించిన వారికే ఎన్నికల్లో ఓటు హక్కు ఉంటుంది. ఆటోనగర్ పరిధిలో ఉన్న జమాక్ సముదాయం వారికి మాత్రం ఓటు హక్కు ఉండదు. కేవలం ఇండస్ట్రియల్ వారికి మాత్రమే ఓటు హక్కు ఉంటుంది. అది కూడా ఆస్తిపన్ను సర్వీస్ సొసైటీలో సభ్యులైన వారు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకునేందుకు అర్హులు. కార్మికవాడలో మొత్తం 1,800 ప్లాట్లు, 13 వార్డులు ఉన్నాయి. 1,800 మంది ఓటర్లు ఉన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



పటమట(విజయవాడతూర్పు): నగరంలో పనిచేస్తున్న హోంగార్డులలో ఎవరైనా మరణించిన లేక పదవీ విరమణ చేసినా వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కృషి చేస్తున్నామని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. విజయవాడ హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్.అర్జునరావు ఇటీవల ఆకస్మికంగా గుండెపోటుతో మరణించారు. దీంతో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు పోలీసులు హోంగార్డులకు వారి వేతనం నుంచి ఇచ్చిన రూ. 5లక్షల ఆర్థిక సహాయాన్ని ఆయన హోంగార్డు అర్జునరావు భార్య ఎస్‌వీ లక్ష్మీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పనిచేస్తున్న హోంగార్డులు అందరూ స్వచ్ఛందంగా వారికి వచ్చే వేతనం నుంచి చనిపోయిన హోంగార్డు కుటుంబాలకు లేదా పదవీ విరమణ చేసిన హోంగార్డులకు ఆర్థిక ఆసరా కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు ఆర్.ఐ. కె.సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు, విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న నాయకులు

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌కు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డ్ -2025 అవార్డు అందుకున్న సందర్భంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయులను, విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ.. జాతీయ స్థాయి ఆటల పోటీల్లో విద్యార్థులు పాల్గొనే విధంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు, ఆటల పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చి అవార్డు సాధించిన విద్యార్థులకు గ్రామం తరఫున అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌కు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించడం గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు లభించాలని ఆకాంక్షించారు. నున్న సొసైటీ మాజీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి మాట్లాడుతూ.. హైస్కూల్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ గడ్డం కుమార్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.రవిప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు టి.శ్రీలత, టి.విజయవర్మ, జాతీయ స్థాయిలో పాల్గొన్న విద్యార్థులను ఘనంగా సన్మానించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి, ఎస్ఎంసీ వైస్ చైర్మన్ కడవకొల్లు వీరవనిత, కమిటీ సభ్యులు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ దండు సుబ్రహ్మణ్యం రాజు, ఉపాధ్యాయులు డి.గోపినాథ్, పి.నాగేశ్వర రావు, సీహెచ్‌బీవీ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఓనం వేడుకలు



కేరళ నృత్యాలను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను కొనసాగించే దిశగా అడుగులు వేయాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధర్ అన్నారు. ఆ కళాశాల కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో ఓనం వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో కేరళ సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించి సందడి చేశారు. విద్యార్థినులు కేరళ సంప్రదాయ నృత్యమైన తిరువాతిర నృత్యాన్ని ప్రదర్శించారు. వేడుకలను పురస్కరించుకొని కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటుగా భారతీయ సంస్కృతిపైనా పట్టు సాధించాలని సూచించారు. ఐక్యత, వారసత్వం, సంప్రదాయ విలువల పరిరక్షణకు పాటుపడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో సందడి చేశారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ పర్యవేక్షించారు. కళాశాల కోశాధికారి కాజా రాఘవయ్య, ఉపాధ్యక్షుడు పొట్టి సురేంద్రకుమార్, సహాయ కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముసాఫిర్‌ఖానా కమిటీ దేని కోసం?

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రైవేటీకరణ చేస్తున్న ముసాఫిర్‌ఖానాకు ప్రభుత్వం కొత్తగా నియమించిన కమిటీ దేని కోసమో స్పష్టం చేయాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాజీబాబా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ముసాఫిర్‌ఖానా ప్రైవేటీకరణపై తాము నిరసన కార్యక్రమాలను చేపట్టిన నేపథ్యంలో ప్రభుత్వం దానికి కమిటీని నియమించిందన్నారు. అయితే దేని కోసం కమిటీని వేశారో అర్థం కావడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాలను ప్రైవేటీకరణ చేస్తోందని మండిపడ్డారు.

అధ్యాపకులు.. నిత్య విద్యార్థులు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): విద్యార్థులకు పాఠాలు చెప్పే అధ్యాపకులు కూడా నిత్యం విద్యార్థుల మాదిరిగానే ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుండాలని అమెరికాలోని మైక్రోసాఫ్ట్ సంస్థలో సీనియర్ అప్లైడ్ సైంటిస్ట్ బొల్లింపల్లి ప్రియతమ్ సూచించారు. పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, న్యూఢిల్లీలోని ఏఐసీటీఈ సంస్థ సంయుక్తంగా కంప్యూటర్ సైన్స్‌లో నూతన ఆవిష్కరణలు, వాటిని అధ్యాపకులు అందిపుచ్చుకోవడం ఎలా అనే అంశంపై సదస్సు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రియతమ్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం అనేది చాలా వేగంగా మార్పులు చెందుతోందన్నారు. ఆ మార్పులను గమనిస్తూ అధ్యాపకులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుండాలని సూచించారు. సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్ రవికిరణ్ మాట్లాడుతూ ఈ ఆరు రోజుల ఆన్‌లైన్ శిక్షణలో క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, హైపర్‌డైమెన్స్ కంప్యూటింగ్ సిస్టమ్స్, సూపర్ కంప్యూటింగ్‌లో కృత్రిమ మేధస్సు, డీప్ లెర్నింగ్, న్యూయరల్ నెట్‌వర్క్, అభివృద్ధి చెందిన కంప్యూటింగ్‌లో నైతిక పరామర్శలు, క్వాంటమ్ ఆల్గారిథమ్స్ మొదలైన అంశాలపై దేశ విదేశాల్లోని సాంకేతిక నిపుణులు ఆన్‌లైన్ ద్వారా హాజరై శిక్షణ ఇచ్చారని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి 313 మంది అధ్యాపకులు ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యారని పేర్కొన్నారు.

ప్రభుత్వ సొమ్మును దోచిపెట్టడం బాబుకు పరిపాటి



డాక్టర్ మెహబూబ్ షేక్

పటమట(విజయవాడతూర్పు): చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలో ఉన్నా ప్రభుత్వ సొమ్మును, ఆస్తులను ప్రైవేట్ పెత్తందారులకు దోచిపెట్టడం ఆనవాయితీగా మారిందని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పది ప్రభుత్వ వైద్య కళాశాలలు, అపర సంజీవనిగా పేరొందిన ఆరోగ్య శ్రీని ప్రైవేటుకు కట్టబెట్టాలని కేబినెట్ నిర్ణయించడంతో మరోమారు స్పష్టమైందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఉండాలనే గొప్ప లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒకేసారి 17 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. ఒక్కో కాలేజీ రూ. 550 కోట్లతో దాదాపు రూ.9వేల కోట్లతో 17 ప్రభుత్వ వైద్య కళాశాలల పనులు ప్రారంభించారని, వాటిలో ఐదు కాలేజీలు రికార్డు సమయంలో పూర్తి చేసి 2023–24 విద్యా సంవత్సరంలోనే అడ్మిషన్లు కూడా ప్రారంభించారని పేర్కొన్నారు.